సాక్షి నంద్యాల

శుక్రవారం । 31 । మార్చి । 2023



టీబీ డ్యాంలో 8 టీఎంసీల నీరు

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో 8.588 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో లేకపోగా ఔట్‌ఫ్లో రూపంలో 6,536 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది.



కేసీ గలగల.. సాగు కళకళ!

కేసీ కెనాల్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కోటా నీరు అందింది. కాల్వ కింద ఆయకట్టుకు గతేడాది జూలై 15 నుంచి నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. 8లో▸

ఉష్ణోగ్రతలు

కనిష్టం	23.4
గరిష్టం	38.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:51
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:54
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:54
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:49

హదీస్ వెలుగు :

ఉపవాస దీక్షలు పాటించే వారి పట్ల మృదు స్వభావం కలిగి ఉండండి. వారి పట్ల కఠినత్వం చూపే వారి పట్ల అల్లాహ్ కూడా కఠినంగా ఉంటాడు. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

పవిత్రమైనది రంజాన్ మాసం



ప్రార్థనలు చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమని, నెలంతా నిష్టతో ఉపవాస దీక్షలు చేస్తారని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం నూనెపల్లిలోని జామియానా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర ఉన్న జామియానా మసీదును సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నంద్యాల ప్రాంతంలో మతాలకతీతంగా ప్రజలు పండుగలు జరుపుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల ద్వారా అల్లా ఆశీర్వాదం పొంది అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

సింహవాహనంపై శ్రీరంగనాథుడు



ప్రభోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో స్వామివారిని అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని ఊరేగింపు తీసుకెళ్లి ప్రభపైకి చేర్చారు. భక్తులు గోవిందనామస్మరణ చేస్తూ ప్రభోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) నూతన కార్యవర్గ (2023–2024) ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. న్యాయవాద సంఘంలో 903 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. అధ్యక్ష స్థానం కోసం టి.నాగభూషణం నాయుడు, బి.చంద్రుడు, ఉపాధ్యక్ష స్థానం కోసం షాబుద్దీన్, నిత్యజీవన రాజు పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆయా స్థానాలకు కర్నూలులో ఉదయం పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.


పోలీసుల దొంగాట

అక్రమాలకు అడ్డా 'తాలూకా పోలీసుస్టేషన్'

- ఎస్పీ పేరుతో ఏడాది కిందట రూ.15లక్షలు వసూలు చేసిన అప్పటి సీఐ కంబగిరి రాముడు
- అదే స్టేషన్‌లో సీఐపై కేసు నమోదు చేసిన అప్పటి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి
- తాజాగా అదే స్టేషన్‌లో రూ.75లక్షల విలువ చేసే 105 కిలోల వెండి మాయం
- రికార్డులకెక్కని రూ.2.05లక్షల నగదు.. కొనసాగుతున్న రహస్య విచారణ
- మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఆదోని సెబ్ ఎస్‌ఐ విజయ్ సస్పెన్షన్
- పోలీసు బాస్ చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఆగని దందాలు

పోలీసు శాఖలో పాలన గాడి తప్పుతోందా? సంస్కరణలతో ప్రతిష్ట పెంచాలని చూస్తున్న పోలీస్ బాస్‌కు తప్పుడు నివేదికలు ఇస్తూ కిందిస్థాయి అధికారులు అక్రమార్జనకు వక్రమార్గంలో వెళ్తున్నారా? ఇటీవల జరిగిన పరిణామాలు పోలీసు శాఖ ప్రతిష్టను మసకబారేలా చేస్తున్నాయా? తాజా పరిణామాలను విశ్లేషిస్తే అవుననే సమాధానం వస్తోంది. పోలీసులే దొంగలుగా, మోసగాళ్లుగా మారి అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో 'న్యాయం' కోసం స్టేషన్ గుమ్మం తొక్కే సామాన్యుల పరిస్థితి ఏంటని పోలీసు శాఖతో పాటు అన్ని వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



కర్నూలు పోలీసు.. అన్ని అంశాల్లో రాష్ట్రంలోనే అందరి కంటే అగ్రస్థానంలో ఉండాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శ్రమిస్తున్నారు. 'సిటీ పోలీస్', ట్రాఫిక్ నియంత్రణ, సెల్‌ఫోన్ రికవరీ, ప్రాపర్టీ రికవరీ, లోక్ అదాలత్ ద్వారా క్రైం రేటు తగ్గించడంతో పాటు తను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి గట్టిగా పనిచేయాలని తపిస్తున్నారు. అయితే కిందిస్థాయి సిబ్బంది ఏమాత్రం ఆయనకు సహకరించని పరిస్థితి. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో వాస్తవాలు ఎస్పీ చాంబర్ లోనికి వెళ్లడం లేదని తెలుస్తోంది. ఇస్తున్న 'ఫీడ్‌బ్యాక్'కు స్టేషన్లలోని వాస్తవ పరిస్థితికి ఏమాత్రం పొంతన ఉండటం లేదని సమాచారం. దీంతో చాలా మందిలో డ్యూటీపై జవాబుదారీతనం లేకుండాపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల ఎస్‌ఐలపై సీఐలకు, సీఐలపై డీఎస్పీలకు పట్టు లేకుండా పోయింది. ఈ కారణంగానే తప్పులమీద తప్పులు జరుగుతున్నాయి.

తాలూకా స్టేషన్లో పోలీసులే దొంగలు

అక్రమాలకు తాలూకా పోలీసుస్టేషన్ అడ్డాగా మారింది. 2021 జనవరిలో తమిళనాడుకు చెందిన వ్యక్తులు హైదరాబాద్ నుంచి చెన్నైకి రూ.75లక్షలు విలువ చేసే 105 కిలోల వెండి, రూ.2.05లక్షల నగదుకు ఆధారాల్లేవని 2021 జనవరిలో సీజ్ చేశారు. దీన్ని అప్పటి సీఐ విక్రమసింహా స్టేషన్‌లో భద్రపరిచారు. ఆపై వెంకటరమణ వారం రోజులు సీఐ, ఆ తర్వాత కంబగిరి రాముడు, ఆపై శేషయ్య.. ప్రస్తుతం రామలింగయ్య సీఐలుగా కొనసాగారు. పట్టుబడిన ప్రాపర్టీని తీసుకునేందుకు కోర్టు రికార్డులతో బాధితులు స్టేషన్‌కు వచ్చారు. అయితే స్టేషన్‌లో ప్రాపర్టీ లేదు. ఈ సమాచారాన్ని రామలింగయ్య ఎస్పీకి చేరవేశారు. దీంతో అక్కడ పనిచేసిన సీఐలతో పాటు స్టేషన్‌లోని సిబ్బందిని ఉన్నతాధికారులు విచారించారు. మహిళా కానిస్టేబుల్ అమరావతి దీన్ని దొంగలించినట్లు తేల్చారు. వెండిని విక్రయించిన కర్నూలు షరాఫ్‌బజార్‌లోని దుకాణానికి వెళ్లి రికవరీ చేస్తున్నారు.

ఈ ప్రశ్నలకు సమాధానాలేవీ?

- బిల్లులు లేకుండా రికార్డులేని ప్రాపర్టీ పట్టుబడితే 102 సీఆర్‌పీసీ కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి. అలా చేస్తే ప్రతినెలా క్రైం రివ్యూలో దానిపై చర్చించే అవకాశం ఉంటుంది.
- ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు?
- స్టేషన్ ప్రాపర్టీ రిజిస్టర్‌లో కూడా నమోదు చేయలేదు.
- సీఐలు బదిలీ అయినప్పుడు 'రికార్డెడ్, అన్ రికార్డెడ్ హ్యాండింగ్ ఓవర్ లిస్టు' ఎందుకు చేయలేదు?
- పంచనామా చేసి కేవలం జీడీ(జనరల్ డైరీ)లో మాత్రమే ఎందుకు రాశారు?
- బిల్లులు లేకుండా పట్టుబడిన వెండి, నగదును కమర్షియల్ ట్యాక్స్ లేదా ఇన్‌కంటాక్స్ అధికారులకు ఎందుకు ఇవ్వలేదు.
- ఇంత పెద్ద ప్రాపర్టీపై ఎందుకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది?

ఇదీ లాజిక్కు..

ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా పంచనామా మాత్రమే చేస్తే ఆ తర్వాత బాధితులతో సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో చాలామంది ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం లేదు. తాలూకా స్టేషన్‌లో కూడా అదే జరిగింది. పక్కా ప్రణాళిక ప్రకారమే దీన్ని కాజేసినట్లు స్పష్టమవుతోంది.

పట్టుబడిన వెండిని పోలీసులే కాజేశారు

- ఇద్దరిపై తాలూకా పీఎస్‌లో కేసు నమోదు

కర్నూలు: కర్నూలు తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రూ.80 లక్షల విలువ చేసే వెండి నగలను పోలీసులే కాజేసినట్లు ఆ శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. సొత్తు మాయమైన ఘటనలో కానిస్టేబుల్ రమణబాబు, హెడ్ కానిస్టేబుల్ అమరావతిపై వారు పనిచేస్తున్న స్టేషన్‌లోనే కేసు నమోదయ్యింది. కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద 2021 జనవరి 28వ తేదీ రాత్రి హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వస్తున్న తమిళనాడు రిజిస్ట్రేషన్ కారును అధికారులు సోదా చేయగా అందులో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యాపారుల వద్ద 105 కిలోల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదును గుర్తించారు. వీటికి ఎలాంటి ఆధార ధృవపత్రాలు చూపకపోవడంతో సొత్తును సీజ్ చేసి అర్బన్ తాలూకా పోలీసులకు అప్పగించారు. వెండికి సంబంధించిన వ్యాపారులు న్యాయస్థానం నుంచి అనుమతి పొంది ఈనెల 27వ తేదీన స్టేషన్‌కు వచ్చి సొత్తు అప్పగించమని పోలీసులను కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న సీఐ రామలింగయ్య బీరువా తెరిచి చూడగా కనిపించకపోవడంతో కంగుతిన్నాడు. ఇదే విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరపగా రమణబాబు, అమరావతి కలసి కాజేసినట్లు బయటపడింది. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి కర్నూలు షరాఫ్ బజార్‌లోని ఓ దుకాణం నుంచి 45 కిలోల వెండిని రికవరీ చేసినట్లు సమాచారం.

గతేడాది ఏకంగా సీఐపైనే స్టేషన్‌లో కేసు నమోదు

గతేడాది మార్చి 19న సెబ్ అధికారులు పంచలింగాల చెక్‌పోస్టులో ఆధారాలు చూపించినా రూ.75లక్షలు నగదును సీజ్ చేశారు. నగదు ఇవ్వాలంటే ఎస్పీకి రూ.15లక్షలు ఇవ్వాలని అప్పటి సీఐ కంబగిరి రాముడు డబ్బు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరించిన గౌరీశంకర్, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు సీఐపై కేసు నమోదు చేశారు. అప్పట్లో ఈ చర్య పోలీసుశాఖకు కలంకంగా మారింది. ఇప్పుడు తాలూకాలో జరిగిన ఘటన పోలీసు ప్రతిష్ట పరువుపోయేలా చేసింది.

కల్పతరువుగా పంచలింగాల చెక్‌పోస్టు

కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌కు పంచలింగాల చెక్‌పోస్టు కల్పతరువుగా మారింది. తనిఖీల్లో భారీగా నగదు, బంగారం, వెండి పట్టుబడుతున్నాయి. వీటిని కేసులో చూపించే సమయంలో కొద్దిగా నొక్కేసి, కొంత మాత్రమే చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చివరకు ఇక్కడ ఖరీదైన మద్యం పట్టుబడితే వాటిని కూడా కొందరు కానిస్టేబుళ్లతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే చర్చ ఉంది. అందుకే ఈ స్టేషన్‌లో పోస్టింగ్ కోసం చాలామంది పోటీపడుతున్నారు. తాజా ఘటనలు, అనుభవాల నేపథ్యంలో పంచలింగాల చెక్‌పోస్టు, తాలూకా స్టేషన్‌పై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

పోలీసు ప్రతిష్టకు భంగం వాటిల్లే ఘటనల్లో మరిన్ని..

- ప్రేమపెళ్లి చేసుకున్న ఓ జంట తుగ్గలి ఎస్‌ఐ షామీర్‌బాషాను ఆశ్రయించింది. వీరి నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించారు. దీంతో పాటు పలు అవినీతి ఆరోపణలతో ఆయనను సస్పెండ్ చేశారు.
- గతేడాది మే 29న విధుల్లో నిర్లక్ష్యం, ఇతర కారణాలతో సీఐ మహేశ్వరరెడ్డిని సస్పెండ్ చేశారు.
- గతేడాది సెప్టెంబర్ 14న స్థలం పంచాయితీ విషయంలో సి.బెళగల్ ఎస్‌ఐ శివాంజనేయులు లంచం తీసుకుంటుంటే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఆలూరులో ఇసుక పంపాలని, లేదంటే మొత్తం బంద్ చేయాలని సీఐ ఈశ్వరయ్య దుబ్బలింగ అనే వ్యక్తిని బెదిరించారు. ఈ ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అయింది.
- ఆదోనిలో సెబ్ ఎస్‌ఐ విజయ్ ఏకంగా కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తూ పట్టుబడిన ఘటనలో ఈ నెల 29న సస్పెండ్ అయ్యారు.
- ఓ చీటింగ్ కేసులో నిందితుడిని బెదిరించి లంచం డిమాండ్ చేసిన ఘటనలో గతేడాది మే 26న ఏసీబీ అధికారులు ఏఎస్‌ఐ ఖాదర్‌వలిని గతేడాది మేలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆపై అతను రిమాండ్‌కు వెళ్లారు.

కేసు నమోదు



తాలూకాస్టేషన్‌లో గతేడాది మేలో వెండి, నగదు దొంగలించారు. స్టేషన్లో పనిచేస్తున్న కొందరు పోలీసులే ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఎవరు చేశారు? ఎలా జరిగిందనేది స్పష్టత వచ్చింది. ప్రాపర్టీని కూడా రికవరీ చేస్తున్నాం. ఈ చర్యకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేశాం. ప్రాపర్టీ పట్టుబడిన వెంటనే 102 సీఆర్‌పీసీ కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ, కర్నూలు



మహానందిలో హనుమద్వాహనంపై సీతారామలక్ష్మణుడు

రాములోరి పెళ్లి ఊరంతా సందడి

శ్రీరామ నవమి వేడుకలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. కోదండరాముడి వివాహ వైభోగాన్ని చూసి భక్తజనం తరించిపోయారు. కల్యాణ రాముడిని, అందాల సీతమ్మను కనులారా దర్శించుకున్నారు. శ్రీరామ.. రఘురామా అంటూ భజనలు చేశారు.

చెంచు గిరిజనుల జీవనంపై అధ్యయనం



కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కలిసిన అధ్యయన కమిటీ సభ్యులు, ఐటీడీఏ అధికారులు

ఆత్మకూరు: నల్లమలలోని చెంచు గిరిజనుల జీవన విధానంపై ఓ బృందం అధ్యయనం చేయనుంది. ఈ మేరకు ఐటీడీఏ అధికారులు, అధ్యయన బృందం సభ్యులు గురువారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కలిశారు. అనంతరం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ అధ్యయన కమిటీ అటవీహక్కుల గుర్తింపు చట్టం అధారంగా 2006కు ముందు నల్లమలలోని చెంచు గిరిజనుల జీవన విధానం, ప్రస్తుత జీవనశైలిపై పలు విషయాలను అధ్యయం చేయనున్నట్లు చెప్పారు. అధ్యయన కమిటీ సభ్యులు సోషియాలజీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి మోహన్‌పాత్ర ఆధ్వర్యంలో అక్షయ మహాపాత్ర, అభిషేక్‌కుమార్, రఘువంశీ ఆత్మకూరు మండలంలోని బైర్లూటీ, నాగలూటీ, పెచ్చెర్వు అటవీ గ్రామాల్లో నివసించే చెంచు గిరిజనుల తెగలపై జీవన విధానం పరిశోధన చేయనున్నారన్నారు. బైర్లూటీలో 1,262 ఎకరాల్లో 290.19 ఎకరాల వ్యవసాయ భూహక్కుల పత్రాలను అందించారని, ఇంకా సర్వే ఉందన్నారు. నాగలూటి, పెచ్చెర్వు గూడేల్లో కూడా భూమికి సంబంధించిన పట్టాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఓ మురళీధర్, ఆర్డీఓ దాస్, ప్రాజెక్ట్ మేనేజర్ నాయక్, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కళాశాలకు ఆరు పీజీ సీట్లు

- గ్యాస్ట్రో, పల్మనాలజీకి రెండేసి సీట్లు
- కొత్తగా న్యూరాలజీకి రెండు సీట్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో వివిధ విభాగాలకు తాజాగా ఆరు పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్యాస్ట్రో ఎంట్రాలజీకి రెండు పీజీ సీట్లు ఉండగా అదనంగా రెండు, పల్మనరీ మెడిసిన్‌కు రెండు పీజీ సీట్లు ఉండగా మరో రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో పాటు కొత్తగా న్యూరాలజీ విభాగానికి రెండు పీజీ సీట్లు మంజూరు కావడం విశేషం. కాగా, రెండు వారాల క్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కళాశాల, ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. కళాశాలకు మొత్తం 41 పీజీ సీట్లు మంజూరు కానుండగా అందులో 30 సీట్లకు వారు పరిశీలన చేశారు. ఇందులో ప్రస్తుతం ఆరు సీట్లు మంజూరు కాగా మిగిలిన సీట్లు కూడా త్వరలో మంజూరయ్యే అవకాశముందని కళాశాల వర్గాలు భావిస్తున్నాయి.

వాల్మీకుల సభ ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు(అర్బన్): నగరంలో ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించనున్న వాల్మీకుల సభకు కావాల్సిన ఏర్పాట్లను మేయర్ బీవై రామయ్య పరిశీలించారు. సభ నిర్వహించనున్న వాల్మీకి మహర్షి విగ్రహం ఉన్న ప్రాంతాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వేలాది మంది వాల్మీకులు ఈ కార్యక్రమానికి తరలి వస్తారని, వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

హైవే కల.. సాకారమవుతున్న వేళ

- శరవేగంగా నంద్యాల– జమ్మలమడుగు హైవే అలైన్‌మెంట్ పనులు
- 84 కి.మీ. జాతీయ రహదారి నిర్మాణానికి రూ.934 కోట్లు
- నాలుగు ప్రాంతాల్లో బైపాస్
- రూ. 135 కోట్లతో భూసేకరణ పనులు

కోవెలకుంట్ల: డబుల్ లేన్‌గా ఉన్న నంద్యాల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రోడ్డు.. జాతీయ రహదారికి మారుతుండటంతో రెండు జిల్లాల ప్రజల ఏళ్లనాటి కల నెరవేరబోతోంది. రహదారి నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) పూర్తి అయి అలైన్‌మెంట్ పనులు శర వేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఉన్న 167 నేషనల్ హైవే రోడ్డు పొడిగింపులో భాగంగా ఈ రహదారి నేషనల్ హైవేగా మారుస్తున్నారు. పది మీటర్ల వెడల్పు బీటీ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా మూడున్నర మీటర్ల బరమ్‌తో విశాలమైన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు దాదాపు 84 కి.మీ. మేర జాతీయ రహదారిని నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 934 కోట్లు కేటాయించింది. ఈ రహదారిలో గత పది రోజుల నుంచి భూసేకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 84 కిమీ రోడ్డు నిర్మాణాన్ని రెండు భాగాలుగా చేపడుతున్నారు. నంద్యాల సమీపంలోని 186/02 కి.మీ. నుంచి కానాల, గోస్పాడు, కోవెలకుంట్ల, సంజామల మండలం నొస్సం సమీపంలోని 248/010 కి.మీ. వరకు 62 కిమీ మీటర్ల మేర మొదటి భాగం, అక్కడి నుంచి వైఎస్సార్‌జిల్లా పెద్దముడియం మండలం గుల్లకుంట మీదుగా జమ్మలమడుగు వరకు 22 కి.మీ. మేర రెండో భాగంగా విభజించి రోడ్డును నిర్మించనున్నారు. భూసేకరణకు రూ. 135 కోట్లు కేటాయించారు. పది మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణంతో పాటు నంద్యాల మండలం కానాల, గోస్పాడు, కోవెలకుంట్ల, సంజామల మండలం నొస్సం ప్రాంతాల్లో బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేసేలా అలైన్‌మెంట్ రూపొందించారు. కోవెలకుంట్ల పట్టణ శివారులో జగనన్న కాలనీ మీదుగా బైపాస్ వెళ్లనుంది. ఈ ప్రాంతంలో 33 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వగా కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. భూసేకరణలో ఆ ప్లాట్లు పోతుండటంతో వారికి నష్ట పరిహారంతోపాటు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



జాతీయ రహదారిగా మారనున్న నంద్యాల-జమ్మలమడుగు రహదారి



నంద్యాల- జమ్మలమడుగు రహదారిలో భూసేకరణ పనులు జరుగుతున్న దృశ్యం

పలు రాష్ట్రాలకు అనుసంధానం..

నంద్యాల- జమ్మలమడుగు జాతీయ రహదారి ఏర్పాటుతో పలు రాష్ట్రాలకు కనెక్టివిటి సౌకర్యం కలుగుతుంది. నంద్యాల మండలం కానాల సమీపంలో ఉన్న నేషనల్ హైవే నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మమడుగు సమీపంలోని కన్నెలూరు వద్ద జాతీయ రహదారికి రోడ్డు అనుసంధానం అవుతుంది. జాతీయ రహదారి ఏర్పాటుతో నంద్యాల మీదుగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు సురక్షిత దగ్గరి మార్గం అవుతుంది. అలాగే రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాలతోపాటు తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని హైదరాబాదు, చెన్నై, బళ్లారి ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. ఆయా రాష్ట్రాల ప్రజలు వివిధ ప్రాంతాలకు చేరుకునేందుకు దగ్గరి మార్గం కానుంది. భూసేకరణ పనులు పూర్తి కావస్తుండటంతో త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పలుచోట్ల బైపాస్ రోడ్డు ఏర్పాటు కానుండటంతో రహదారిలో ట్రాఫిక్ కష్టాలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా సరక్షిత ప్రయాణానికి మార్గం సుగమం కానుంది.

ప్రయాణం సులభతరం



నంద్యాల- జమ్మలమడుగు రహదారి నేషనల్ హైవేగా మారనుండటంతో ప్రయాణం సులభతరమవుతుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పక్క రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలకు దగ్గరి మార్గం అవుతుంది. బెంగళూరు, చెన్నై, బళ్లారి, తదితర ప్రాంతాలకు రోడ్డుమార్గం ద్వారా త్వరగా చేరుకునే వీలు కలుగుతుంది.

– దస్తగిరి, సౌదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

ఏళ్లనాటి కల నెరవేరబోతుంది



నంద్యాల- జమ్మలమడుగు డబుల్ లేన్‌గా రోడ్డు జాతీయ రహదారిగా మారనుండటంతో ఏళ్లనాటి ఈ ప్రాంత ప్రజల కల నెరవేరబోతుంది. గతంలోనే ఈ ప్రాతిపాదన ఉండగా కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడం శుభ పరిణామం. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలి.

– జగన్‌మోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల

క్లుప్తంగా

కానిస్టేబుల్ మృతి


అన్వర్ బాషా (ఫైల్)

కర్నూలు : రైల్వే విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ అన్వర్ బాషా (35) కిడ్నీ వ్యాధితో కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన అన్వర్ బాషా 2013లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించాడు. గత కొంతకాలంగా కిడ్నీ జబ్బుతో బాధపడుతుండగా ఇటీవల కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు భార్యతో పాటు కుమారుడు సంతానం. ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉంది. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతిచెందిన జానీబాషా

గోనెగండ్ల: రోడ్డు ప్రమాదంలో జానీ బాషా(23) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఎస్ లింగందిన్నె గ్రామం క్రాస్ రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన జానీబాషా తన సొంత పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై పత్తికొండకు వెళ్లాడు. రాత్రి పనులు ముగించుకొని తిరిగి పులకుర్తి గ్రామానికి బయాలుదేరాడు. ఎస్ లింగందిన్నె గ్రామం క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే కర్నూలు నుంచి పత్తికొండకు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న జానీబాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య చాందిని, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ


తీవ్రంగా గాయపడిన చిన్న ఈరప్ప

మంత్రాలయం రూరల్: భూ వివాదంతో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఈడిగ బొడ్డయ్య కుమారులైన పెద్ద ఈరప్పకు చిన్న ఈరప్ప, నరసింహులు మధ్య భూవివాదం ఉంది. ఈ క్రమంలో గురువారం పెద్ద ఈరప్పపై చిన్న ఈరప్ప దాడి చేశాడు. గాయపడిన పెద్ద ఈరప్పను చూసిన వారి కుటుంబ సభ్యులు వెంటనే చిన్న ఈరప్పపై వేట కొడవళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.


కోడుమూరు: ఉత్సవమూర్తులైన శ్రీసీతారామలక్ష్మణులు


మంత్రాలయం: మూలరాముల పూజల్లో శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు


నంద్యాల: బాలాజీ కాంప్లెక్స్‌లో ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణులు


కర్నూలు: వెంకటరమణ కాలనీలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

పురుషోత్తమా.. ప్రణమామి!


దొర్నిపాడు: అమ్మిరెడ్డి నగరంలో గ్రామోత్సవంలో సీతారాములు

"శ్రీరామ రామ రామేతి.. రమే రామే మనో రమే.. సహస్ర నామ తత్తుల్యం.. రామ నామ వరాననే' అంటూ పురుషోత్తముడికి ప్రజలు పూజలు నిర్వహించారు. కోదండరాముడి సచ్ఛీలతను, సమర్ధతను స్మరించుకున్నారు. శరణు జొచ్చిన వారికి అభయమివ్వడం.. పెద్దలను, మిత్రులను గౌరవించటం.. అసత్య మాడకుండటం.. ఏకపత్నీ వ్రతం మొదలైన నీల మేఘశ్యాముని సుగుణాలను కీర్తించారు. గురువారం ఊరూరా శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. కర్నూలు, నంద్యాలలో కల్యాణోత్సవమూర్తులను ఊరేగించారు. ఆదోని పట్టణంలో స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆళ్లగడ్డ, డోన్, పత్తికొండ, ఆత్మకూరు, నందికొట్కూరు తదితర పట్టణాల్లో భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


చిన్నారి భక్తిభావం


కర్నూలు: రాంబొట్ల ఆలయంలో ఉత్సవ విగ్రహాలను అలంకరిస్తున్న మహిళ


ఆదోని: ప్రత్యేకాలంకరణలో శ్రీ రణమండల ఆంజనేయస్వామి


కొలిమిగుండ్ల: పెట్నికోటలో పల్లకీ మోస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


కర్నూలు: సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వస్తున్న వృద్ధురాలు


కర్నూలు: గణేష్‌నగర్ జర్నలిస్టు కాలనీలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు


కర్నూలు: రామలింగేశ్వరనగర్‌లో అన్నదానం


నంద్యాల: గిరిన్నాథ్ సెంటర్‌లో పానకం, వడపప్పు పంపిణీ చేస్తున్న దృశ్యం


కోడుమూరు: శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న మహిళలు


కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో మహిళా కళాకారుల డప్పు ప్రదర్శన


కృష్ణగిరి: పెనుమాడలో స్లోబైక్ పోటీల్లో పాల్గొన్న యువకులు

వంద శాతం బిల్లులు వసూలు చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు వంద శాతం వసూలు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. గురువారం ఆయన కిందిస్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కేసీ గలగల.. సాగు కళకళ!

- ఈ ఏడాది 36.2 టీఎంసీల నీటి వినియోగం
- రబీలో 1.37 లక్షల ఎకరాలకు అందిన సాగు నీరు
- సమర్థవంతంగా నీటి నిర్వహణ


కేసీ ఆయకట్టు కింద రబీలో సాగు చేసిన జొన్న

కర్నూలు సిటీ: కేసీ కెనాల్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా కోటా నీరు అందింది. దీంతో రబీలో రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. తుంగభద్ర జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు మొత్తం 39 టీఎంసీల నీటి వాటా ఉంది. ఇందులో నది ప్రవాహం ద్వారా 29 టీఎంసీలు వాడుకోవాల్సి ఉంది. అలాగే డ్యాంలో నిల్వ ఉండే నీటి నుంచి 10 టీఎంసీలు దామాషా ప్రకారం కేటాయింపులు ఉన్నాయి. తుంగభద్ర డ్యాంలో పూడిక చేరిందనే సాకుతో ఏటా నీటి వాటాకు గండికొట్టేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 171 టీఎంసీలకు అంచనా వేశారు. అయితే అంచనాల మించి టీబీ డ్యాంలోకి 188 టీఎంసీల నీరు చేరాయి. దీంతో కేసీ కెనాల్‌కు మొదటగా కేటాయించిన 6.45 టీఎంసీల వాటాను 8.868 టీఎంసీలకు పెంచారు. సుంకేసుల నుంచి కేసీకెనాల్‌కు 31.3 టీఎంసీలు, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి 0.9టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 4.07టీఎంసీలు వాడుకున్నారు. మొత్తంగా కేసీ కెనాల్‌కు 36.2 టీఎంసీల నీటిని వాడుకున్నారు.

మొట్టమొదటి సారి..

గతేడాది జూలై 15 నుంచి కేసీకి నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. టీబీ డ్యాంలోని వాటా నీటి విడుదల ఈ నెల 27వ తేదీతో ముగిసింది. అయినా కాలువలో నీటి ప్రవహం కొనసాగుతూనే ఉంది. సుంకేసుల జలాశయం నుంచి 602 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. కర్నూలు, వైఎస్సార్ జిల్లాల సాగు, తాగు నీటి అవసరాలు కేసీ కెనాల్‌పై ఆధారపడి ఉన్నాయి. ఈ కాలువ చరిత్రలోనే మొట్టమొదటిసారి రబీ సీజన్‌లో ఆయకట్టు అత్యధికంగా సాగైంది. రబీలో 90 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటే అంతకు మించి మరో 47 వేల ఎకరాలకు అదనంగా సాగయ్యాయి.

మెరుగుపడిన నీటి సరఫరా

టీడీపీ హయాంలో, అంత కంటే ముందున్న ఉమ్మడి రాష్ట్రంలోని చివరి ప్రభుత్వ హయాంలో కేసీ కెనాల్ కింద మొదటి పంటలకే సాగు నీరు సక్రమంగా అందేది కాదు. చివరికి పంటలను పశువుల మేపుకు వదిలేసిన రోజులు ఉన్నాయి. అయితే 2019 తరువాత నీటి కష్టాలు తొలగాయి. గతంలో ఏ తూము దగ్గర కూడా నీటి నియంత్రణ సక్రమంగా ఉండేది కాదు. దీంతో అధికంగా నీరు వృథా అయ్యేది. సాగైన పంటలకు సక్రమంగా నీరు అందేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటి సరఫరా మెరుగుపడింది. జలవనరుల శాఖ ఇంజినీర్లు రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నారు.

నీటి నిర్వహణ చక్కగా చేశారు

సాగునీటి సలహా మండలి సమావేశంలో చేసిన తీర్మానం మేరకు కేసీ కాల్వ కింద రబీ సీజన్‌లో 90 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పూర్తి స్థాయిలో అందించాం. సాగైన పంటలు కోతకు వచ్చాయి. కేసీ కెనాల్ ఈఈ, డీఈఈ, జేఈఈ, ఏఈఈలు కాల్వపై పర్యటనలు చేశారు. నీటి నిర్వహణ చక్కగా చేశారు. తుంగభద్ర డ్యాంలోని కేసీ వాటా కోటా పూర్తి అయ్యింది. ఈ ఏడాది 8.868 టీఎంసీలు నీటి కేటాయింపులు చేశారు. నీటినంతా వినియోగించుకున్నాం.

– రెడ్డి శేఖర్ రెడ్డి, జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని..

- రూ. 9 లక్షలతో ఉడాయింపు
- గడివేముల వద్ద పట్టుబడిన నిందితులు

బొమ్మలసత్రం: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మి డబ్బుతో వచ్చిన వ్యక్తిని చితకబాది డబ్బులు, కారు తీసుకుని పరారవుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన గురువారం నంద్యాలలో చోటు చేసుకుంది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన దస్తగిరిని నంద్యాలలో తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని అదే జిల్లా కడప పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు నమ్మించారు. వారి మాటలు నమ్మి గురువారం రూ. 9 లక్షలు తీసుకుని నంద్యాలకు చేరుకున్నాడు. పట్టణ శివారులోని పీవీ నగర్ ప్రాంతానికి దస్తగిరిని తీసుకెళ్లి చితకబాది రూ.9 లక్షలు లాక్కుని వచ్చిన కారులో గడివేముల వైపు పారిపోయారు. వెంటనే దస్తగిరి తేరుకుని 100 ఫోన్ చేసి జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించారు. పోలీసులు వెంటనే గడివేముల, బండిఆత్మకూరు, వెలుగోడు, నంద్యాల పోలీసులను అప్రమత్తం చేశారు. నిందితులు తమ కారుతో గడివేముల చేరుకోగానే ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కారుతో పాటు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సంఘటనపై డీఎస్పీ మహేశ్వర రెడ్డిని వివరణ కోరగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలుపుతామన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి

- ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల దుర్మరణం, మరొకరి పరిస్థితి విషమం
- మృతులిద్దరూ నందికొట్కూరు వాసులు


జనార్దన్ (ఫైల్)


దీపక్ (ఫైల్)


గాయపడిన మధు

నందికొట్కూరు: ఒకే కాలనీలో నివాసముంటున్న ముగ్గురు యువకులు చిన్నప్పటి నుంచి స్నేహితులు. జీవితంలో ప్రయోజకులవుతున్న తరుణంలో రోడ్డు ప్రమాదం ఇద్దరిని కబళించింది. మరొకరిని ఆసుపత్రి పాలుజేసింది. ఈ విషాద ఘటన కర్నూలు - గుంటూరు రహదారిలో బ్రాహ్మణకొట్కూరు పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న బైరెడ్డినగర్‌కు చెందిన జనార్దన్ (23), దీపక్ (22), మధు (22) ముగ్గురు స్నేహితులు. మధు బ్యాండ్ మేళం వాయిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. హైదరాబాద్‌లో శ్రీరామనవమి ఉత్సవాలకు బ్యాండ్ మేళం వాయించేందుకు బుధవారం రాత్రి బయలుదేరగా.. జనార్దన్, దీపక్ కర్నూలులో వదిలేసేందుకు ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్లారు. మార్గమధ్యలో బ్రాహ్మణకొట్కూరు పెట్రోల్ బంక్ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయారు. అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనార్దన్, దీపక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలకు గురైన మధును కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం పోలీసులు తెలిపారు.

మొక్కుతీర్చుకునేందుకు వచ్చి..

నందికొట్కూరు పట్టణం పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డినగర్‌కు చెందిన కృష్ణవేణి, అంబన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జనార్దన్ హైదరాబాద్‌లో టాటా కంపెనీలో 8 నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరాడు. తమ కల నెరవేర్చి కుటుంబానికి ఆసరాగా నిలిచాడని తల్లిదండ్రులు ఆనందపడుతున్న వేళ ఆ ఇంట విషాదం నెలకొంది. గడివేముల పెద్దమ్మ మొక్కు తీర్చుకునేందుకు జనార్దన్ హైదరాబాద్ నుంచి వచ్చాడు. ఇంతలోనే స్నేహితులతో కలసి వెళ్లి ప్రమాదానికి గురై మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆరు నెలల క్రితం భార్య.. ఇప్పుడు కొడుకు దూరం

నందికొట్కూరు పట్టణం పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డినగర్‌కు చెందిన కోదండరామ్, ఉమాదేవి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు దీపక్. బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో జాబ్ కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆరునెలల క్రితం ఉమాదేవి క్యాన్సర్ బారిన పడి మృతి చెందింది. ఆ ఘటన నుంచి కోదండరామ్ తేరుకోకముందే కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో దూరం కావడంతో 'ఇక నాకెవరూ దిక్కు' అంటూ రోదిస్తుండటంతో అక్కడ ఉన్న వారు కంటతడి పెట్టారు.